ప్రజాశక్తి
బుధవారం 03 మే 2023
5
కర్నూలు

బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- అప్పర్‌భద్రపై సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పి - సాంకేతిక కారణాలతో కృష్ణా బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయలేదు

- డిఆర్‌సిలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆదేశించారు. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం చెబుతూ అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని, సాంకేతిక కారణాల వల్లనే కర్నూలులో కృష్ణా యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేక పోయామని మంత్రి చెప్పారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, తాగునీరు, గహ నిర్మాణాలు, వ్యవసాయం, ఇరిగేషన్ అంశాలపై జిల్లా రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి మాట్లాడుతూ వేసవికాలంలో గ్రామాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలు, ఇతర నీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ వర్షాలు బాగా పడ్డాయని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలవల్ల ఈ మూడు, నాలుగేళ్లలో తాగునీటి సమస్య చాలా తగ్గిందన్నారు. ప్రధానమంత్రి పివి.నరసింహారావు నంద్యాల ఎంపీగా ఉన్న సమయంలో నంద్యాల వాటర్ స్కీంలో భాగంగా ప్యాపిలి, పోదొడ్డి , మామిళ్ళపల్లి గ్రామాలలోని కొంత భాగానికి నీటి సరఫరా కోసం 1995లో పామిడి నుంచి ప్రారంభించిన వాటర్ స్కీమ్ 2004 సంవత్సరానికి అతి కష్టం మీద పూర్తయి 2019 నాటికి ఎండిపోయిందని, ఆ పథకానికి సంబంధించి ఈ ప్రభుత్వం పాత బిల్లులు చెల్లించడంతో పాటు అదనంగా మూడు కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసి ఈరోజు డోన్ నియోజకవర్గంలో 16 గ్రామాలకు నీరు అందిస్తున్నామన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చలో భాగంగా మంత్రి మాట్లాడుతూ ఎగువభద్ర ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్‌లీవ్ పిటీషన్ (ఎస్‌ఎల్‌పి) ఫైల్ చేసిందని, లిస్టు కూడా అయిందని తెలిపారు. ఈ సమస్యను కోర్టు ద్వారా పరిష్కారం సాధించాలనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. వర్షపు నీటి ఆధారంగా ఉన్న గాజుల దిన్నె ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్లూయిస్ ఏర్పాటు చేసి హంద్రీ నీవా నుంచి నీటిని తీసుకున్నామని, ఇది 30,40 యేళ్లుగా ఉన్న డిమాండ్ అని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యాన్ని కూడా ఒక టిఎంసి అదనంగా పెంచనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నుంచి డోన్ కు 0.1 టిఎంసి, ఎమ్మిగనూరు కు 0.2 టిఎంసి, అత్యవసర పరిస్థితుల్లో కర్నూలు నగరానికి తాగునీటి అవసరాల కోసం వాడేందుకు ఉపయోగించే నీరు ఒక టిఎంసి కంటే తక్కువ అని మంత్రి తెలిపారు. అయినప్పటికీ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ప్రతిపాదించిన సి.బెలగల్ చెరువు అప్‌గ్రేడ్ చేయడంపై అధ్యయనం చేయాలని ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డిని మంత్రి ఆదేశించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్లే కర్నూలులో కృష్ణా యాజమాన్య రివర్ బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయలేదని మంత్రి సభ్యులకు సమాధానం ఇచ్చారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ నిర్వహణకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని, నిధుల కేటాయింపుకు తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత ఇంజనీర్‌ను మంత్రి ఆదేశించారు. కోవిడ్ సమయంలో వైద్య సేవలందించిన 280 మంది డాక్టర్లకు జీతాల అంశంపై పరిశీలిస్తున్నామని సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఎల్‌ఎల్‌సికి సంబంధించి జీరో నుంచి 250 కిలోమీటర్ల వరకు తమ ప్రభుత్వం రూ.1400 కోట్ల ఖర్చు చేసి లైనింగ్ పనులు చేయడం వల్లే ఈరోజు కోడుమూరు వరకు నీటితో సస్యశ్యామలంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన సమావేశాన్ని ప్రారంభిస్తూ, కర్నూలు జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో మెరుగైన జిల్లా గా తీర్చి దిద్దే దిశగా ఈ వేదిక ఉపయోగ పడాలని, ఆ మేరకు కార్యాచరణ ప్రణాళిక ను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి, బిటి.నాయుడు, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంఎ. హఫీజ్ ఖాన్, ఎర్రకోటచెన్నకేశవ రెడ్డి, కంగాటి శ్రీదేవి, డాక్టర్‌జె .సుధాకర్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

అడుగడుగునా వినతుల వెల్లువ

- లోకేష్ పాదయాత్రకు జన నీరాజనం

ప్రజాశక్తి - గోనెగండ్ల/కోడుమూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 87వ రోజు ఎమ్మిగనూరు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగింది. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామం వరకు గోనెగండ్ల మండలంలో సాగిన పాదయాత్ర తర్వాత కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోకి చేరింది. కోడుమూరు నియోజకవర్గంలోకి ప్రవేశించిన లోకేష్‌కు అపూర్వస్వాగతం లభించింది. భారీఎత్తున జనం రోడ్లపైకి వచ్చి యువనేతను స్వాగతించారు. అడుగడుగునా యువనేతపై పూలవర్షం కురిపించి బాణసంచా కాలుస్తూ హోరెత్తించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గాజులదిన్నెలోని క్యాంపు సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్రకు దారిపొడవునా జనం నీరాజనాలు పలికారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అడుగడుగునా యువనేతకు ఎదురేగి తమ సమస్యలు చెప్పుకున్నారు. గాజులదిన్నె శివార్లలో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న మునగపంటను పరిశీలించి, రైతు నాగిరెడ్డిని యువనేత పరామర్శించారు. తర్వాత యువనేతను మత్స్యకారులను కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ముంపు బాధితులు, కైరవాడి గ్రామ ఉల్లి రైతులు, గోనెగండ్ల రైతులు, వెముగోడు, పుట్టపాశం గ్రామస్తులు యువనేతను కలిసి తమ సమస్యలను విన్నవించారు. కైరవాడిలో శ్రీనివాసులు అనే రైతు యువనేత లోకేష్‌ను కలిసి భూరక్ష పథకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేశారు. సాయంత్రం కోడుమూరులో నిర్వహించిన బహిరంగ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దఎత్తున జనం హాజరయ్యారు. 87వ రోజు యువనేత లోకేష్ 15.6 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగించారు. మొత్తంగా ఇప్పటివరకు 1118.4 కిలోమీటర్ల మేర యువగళం పాదయాత్ర పూర్తయింది. పాదయాత్రలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యే అరాచకం

కోడుమూరు నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని, వారు అరాచకం సృష్టిస్తున్నారని కోడుమూరు బహిరంగ సభలో లోకేష్ విమర్శించారు. ఒకరు ఎమ్మెల్యే సుధాకర్ అని, మరొకరు షాడో ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి అని, వాళ్ల నియోజకవర్గాన్ని కేక్ ముక్కలా కోసుకొని భూములు, ఇసుక, ఎర్రమట్టి దోచుకుంటున్నారని తెలిపారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం అయినా పెత్తనం అంతా షాడో ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డిదేనన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలన్నా షాడో ఎమ్మెల్యేకు 10 శాతం కప్పం కట్టాల్సిందేనని తెలిపారు. కోడుమూరు కొండరాయుడు కొండను వైసిపి ఎర్రమట్టి మాఫియా అడ్డంగా తవ్వేసిందన్నారు. తుంగభద్ర నదిలో సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె, సింగవరం, ముడుమాల, పల్‌దొడ్డి గ్రామాల వద్ద ఇసుక రీచుల నుంచి అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. అంగన్వాడీ ఉద్యోగాలను సైతం ఎమ్మెల్యే వదలలేదని విమర్శించారు. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారన్నారు. కర్నూలు శివారులో బి.తాండ్రపాడు గంగమ్మ చెరువునే ఆక్రమించారని, రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారని తెలిపారు. ఇందులో ఎమ్మెల్యేకు రూ.కోట్లల్లో ముడుపులు అందాయని అంటున్నారని తెలిపారు. కర్ణాటక నుంచి లిక్కర్ తెచ్చి కోడుమూరులో అమ్మేస్తున్నారన్నారు. జగన్నాథగట్టు మీద జర్నలిస్టులకు ఇచ్చిన కాలనీలో సైతం ఎర్రమట్టి తవ్వేసి, స్థలాలు ఆక్రమించుకుంటున్నారన్నారు.

98 డిఎస్‌సి అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట అభ్యర్థుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

98 డిఎస్‌సి అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి.ఆనంద్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కెవిపిఎస్, 98-డిఎస్‌సి ఉద్యోగాల సాధన కమిటి ఆధ్వర్యంలో రాజ్‌విహార్‌వద్ద ఉన్న అంబేద్కర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి, గాంధీ విగ్రహం ముందు ధర్నా చేశారు. పోరాట కమిటి నాయకులు యాగంటయ్య అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎండి. ఆనంద్‌బాబు పోరాట కమిటి రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, రంగస్వామి, జిల్లా నాయకులు సరోజ, హైమావతి, సుబ్బన్న పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డిఎస్‌సి-98లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసిన అభ్యర్థులు 6,882 మంది ఉన్నారన్నారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిఎస్‌సి-98 కింద 5885 మంది అభ్యర్థులను నియమిస్తున్నట్లు ప్రకటించారన్నారు. 4072 మందిని నియామకం చేసి, ఇందులో రిజర్వేషన్ పాటించకుండా నియామకం జరపడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు , వికలాంగులకు, మహిళలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. డిఎస్‌సి 98లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేదాకా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ధర్నాలో 98 డిఎస్‌సి సర్టిఫికెట్లు వెరిఫై చేసిన అభ్యర్థులు శ్రీదేవి, మాధవి, సత్యవేద, విజయలక్ష్మి, పరమేష్, అయ్యన్న, పుల్లన్న, చెన్నయ్య, రవి, రమేష్, భారతి, సునంద, పద్మజ, శోభ, వైలెట్, కెవిపిఎస్ జిల్లా నాయకులు విజయమ్మ, కృష్ణ, కరుణాకర్, పెద్దబాబు, జయరాజు, తిక్కప్ప, రాజు మరో 200 మంది పాల్గొన్నారు.

కర్నూలు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

మళ్లీ ట్రూ అప్ వసూలు

- ఈనెల నుండి బిల్లులో కలిపి

- ఉమ్మడి జిల్లాపై రూ.163 కోట్ల మేర భారం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత 9 నెలలుగా ట్రూ అప్ (సర్దుబాటు) చార్జీలు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే.. దీనికి అదనంగా ఈనెల నుంచి మరికొంత వసూలు చేయాలని నిర్ణయించారు. ఈనెల నుంచి వచ్చే విద్యుత్ బిల్లులు భారీగా పెరగనున్నాయి....

ఎపిఈఆర్‌సి నుంచి రెండో విడత సర్దుబాటు చార్జీలు వసూలు చేసేందుకు ఇప్పటికే అనుమతి వచ్చింది. ఇందులో భాగంగా 2021-22 సంవత్సరానికి సంబంధించి డిస్కంకు వచ్చిన నష్టాలు పూడ్చుకునేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయనున్నారు. 2021-22 ఏప్రిల్‌లో వాడిన యూనిట్లపై ట్రూ అప్ భారాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో కలుపనున్నారు. ఏ నెలకు సంబంధించిన బిల్లును ఆ నెల వసూలు చేయనున్నారు. అప్పట్లో అధికంగా విద్యుత్ వాడకం ఉంటే.. ప్రస్తుతం అందుకు సంబంధించిన భారం సామాన్యులపై పడనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 11 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ, వాణి, పారిశ్రామిక భారం వేయనున్నారు. నికరంగా 12.50 లక్షల మందిపై సుమారు రూ.163 కోట్ల మేర భారం పడనుంది. 2019 ఏప్రిల్ తర్వాత తీసుకున్న విద్యుత్ కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చారు. గతేడాది ఆగస్టు నుంచి తొలి విడత ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. 2014 నుంచి వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారు. కర్నూలు సర్కిల్‌లోని విద్యుత్ వినియోగదారుల నుంచి 38 నెలల పాటు వసూలు చేస్తున్నారు. గతంలో వినియోగించుకున్న ప్రతి యూనిట్‌కూ 23 పైసలు లెక్క కట్టి బిల్లులో వేస్తున్నారు. ఇలా నాలుగు త్రైమాసికాల్లో నెలవారీగా వసూలు చేసేందుకు చేశారు. ఇప్పటికే బిల్లింగ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అధికారులు సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం వస్తున్న బిల్లులో ఇప్పటికే వసూలు చేస్తున్న సర్దుబాటు చార్జీల కారణంగా బిల్లులో 5 నుంచి 10 శాతం వరకు పెరుగుదల కనిపించవచ్చు. కొత్తగా విధిస్తున్న చార్జీల కారణంగా ఈ భారం మరింత పెరిగే అవకాశముంది.



నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐబిడిపిఎ కర్నూలు సర్కిల్ ప్రెసిడెంట్ యాకోబ్

ఎన్‌ఎఫ్‌పిఇ రద్దు ప్రజాస్వామ్యంపై దాడి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఎన్‌ఎఫ్‌పిఇ యూనియన్ రద్దు ట్రేడ్ యూనియన్స్, ప్రజాస్వామ్యంపై దాడి అని ఐబిడిపిఎ కర్నూలు జిల్లా సర్కిల్ ప్రెసిడెంట్ ఎం.యాకోబ్ అన్నారు. మంగళవారం స్థానిక పోస్టల్ కాలనీ లోని జిఎం కార్యాలయం వద్ద ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ డిఒటి పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టాఫీస్ ట్రేడ్ యూనియన్‌ను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం.యాకోబ్, సర్కిల్ అధ్యక్షులు జి.మహేశ్వరరావు, అసిస్టెంట్ సర్కిల్ సెక్రెటరీ పి.మద్దిలేటి, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.విజయభాస్కర్, మెడికల్ రెప్రసెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రసాద్ శర్మ, బసవరాజు నిరసన కార్యక్రమంలో ప్రసంగించారు. వెంటనే రద్దు చేసిన పోస్టల్ ట్రేడ్ యూనియన్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ , పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎసిబి వలలో కోపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు కోపరేటివ్ సొసైటీ లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సుజాత ఎసిబి తనిఖీల్లో పట్టుబడింది. ఈ మేరకు మంగళవారం కర్నూలు నగరంలో ఆమె ఇంటి తోపాటు బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఐదు చోట్ల ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆమె అక్రమ సంపాదన ద్వారా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు ఎసిబి దష్టికి వచ్చిందని ఈ మేరకు సోదాలు నిర్వహించామని కర్నూలు ఎసిబి డిఎస్‌పి శివ నారాయణస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ఈ సోదాల్లో ఆమెకు సంబంధించిన నాలుగు ఇళ్ల ఎనిమిది స్థలాలు, 30 తులాల బంగారం, రూ.8.21 లక్షలతో పాటు పలు డాక్యుమెంట్లను పత్రాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన మీడియా ముఖంగా తెలిపారు. సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

తేనెటీగల దాడిలో పదిమందికి గాయాలు

ప్రజాశక్తి-వెల్దుర్తి

తేనెటీగల దాడిలో పదిమందికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు మండలంలో కృష్ణాపురం గ్రామంలో మంగళవారం మారెమ్మ దేవర ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామ ప్రజలు పూజలు నిర్వహిస్తున్న సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా చుట్టుముట్టాయి. తేనెటీగల దాడి నుండి రక్షించుకోవడానికి ప్రజలు పరుగులు తీశారు. ఈ క్రమంలో గ్రామ పెద్ద గోపాల్‌రెడ్డితో పాటు పదిమందికి గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

బడి బయట పిల్లలను గుర్తించండి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో బడి బయట ఉండే పిల్లలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి స్కూలు ఎడ్యుకేషన్, సమగ్ర శిక్ష అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో , వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ 5సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్క పిల్లవాడి వివరాలతో పాటు వారు ఇక్కడే ఉన్నారా ? బయట నివసిస్తున్నారా ? ఏ స్కూలులో చదువుతున్నారు? సదరు వివరాలను రోజు వారి నివేదిక రూపంలో అందజేయాలన్నారు. అదే విధంగా ప్రతి మండలంలో ఎంత మంది జనాభా ఉన్నారనేది 15 రోజుల్లో సదరు వివరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్‌టిఇ (12)(1)సికు సంబంధించి ఇంకా 197 మంది విద్యార్థులు పాఠశాలలో చేరలేదని, రెండవ విడతకు సంబంధించి 6వ తేది నుంచి 15వ తేది వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. మిగిలిన విద్యార్థులను సదరు పాఠశాలలో చేరేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలలో నమోదు చేసుకున్న ప్రతి ఒక్క విద్యార్థి, ఉపాధ్యాయుడు హాజరు వేసేలా చూడాలన్నారు. కన్సల్టెంట్ రిథంకు సంబంధించి ఇంకా 194 టికెట్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మొత్తం 1436 పాఠశాలలో గాను గ్యాస్ స్టౌవ్ మీద 818 పాఠశాలలు, కట్టెల పొయ్యి మీద 488, గ్యాస్ స్టౌవ్, కట్టెల పొయ్యి రెండు కలిపి 130 పాఠశాలలో వండుతున్నారన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. అందులో తక్కువ శాతం పంపిణీ చేసిన కౌతాళం మండలంలో 1770 టాబ్లెట్స్‌కు గాను కేవలం నలుగురికే పంపిణీ చేయడం పట్ల జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దికెర మండలంలో 617 టాబ్లెట్స్ కు గాను 12 మాత్రమే పంపిణీ చేశారన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ మే 5వ తేది నాటికి అందరికీ అందజేయాలని, అందజేయని వారికి ఛార్జ్ మెమో ఇస్తామని హెచ్చరించారు. నాడు-నేడుకు సంబంధించి మొత్తం 672 సచివాలయాలు ఉండగా అందులో మొత్తం ఔట్ ఆఫ్ స్కూలు పిల్లలు మొత్తం 1232 మంది ఉన్నారని, వారిలో 881 మందిని తిరిగి పాఠశాలలో చేర్పించామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. సమావేశంలో డిఇఒ రంగారెడ్డి, ఎస్‌ఎస్‌ఎ పిఒ వేణుగోపాల్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాదర్బార్ నిర్వహించిన కర్నూలు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ ఆఫీస్ ఖాన్ మంగళవారం కర్నూలు రాయల్ ఫంక్షన్ హాల్లోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజలతో మాట్లాడుతున్న టిజి.భరత్

గెలిపిస్తే సమస్యలు తీరుస్తా : టిజి భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పాలన సాగిస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని నాల్గవ వార్డులో ఆయన వార్డు పర్యటన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు టిజి.భరత్‌కు సమస్యలు విన్నవించారు. డ్రైనేజీ సమస్య, పెన్షన్లు, విద్యుత్ స్తంభాలకు కరెంట్ షాక్ తగులుతోందని చెప్పారు. ఈ సందర్భంగా వారితో టిజి భరత్ మాట్లాడుతూ నగరంలోని చాలా వార్డుల్లో సమస్యలు ఉన్నాయని చెప్పారు. ప్రజలను పాలించే నాయకుడు కరెక్టుగా లేకపోతే సమస్యలే మిగులుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వార్డు పర్యటన చేపట్టిన టిజి భరత్ కు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మహిళలు, వృద్ధులు, యువత ఆయనతో ఆప్యాయంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని చెప్పారు. వార్డు ఇంచార్జి ఊట్ల రమేష్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

గుండెపోటుతో మార్కెట్ యార్డ్ హమాలి మృతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కోతమాలి అంగడి గుమాస్తాల యూనియన్‌లో పనిచేస్తున్న నెరవాడ గ్రామానికి చెందిన పి.మదార్ సాహెబ్ (44) హమాలి కార్మికుడు మార్కెట్ యార్డు కు బయలుదేరి మార్గమధ్యంలో గుండెపోటుతో మరణించారు. మరణించిన కార్మికుని కుటుంబానికి మార్కెట్ యార్డు పాలకమండలి, ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు కర్నూలు జిల్లా అధ్యక్షులు పిఎస్ .రాధాకృష్ణ, మార్కెట్ యార్డ్ యూనియన్ల గౌరవ అధ్యక్షుడు టి. రాముడు. సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ .నరసింహులు. సిహెచ్.సాయిబాబా డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులతో కలిసి వారు నెరవాడ గ్రామానికి చేరుకొని చనిపోయిన హమాలి కార్మికుని భౌతికకాయంపై పూల మాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి కోతహమాలి యూనియన్ నుండి మట్టి ఖర్చులకు డబ్బులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులు కూడా కాకముందే నెరవాడ గ్రామానికి చెందిన కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలి కార్మికులు గుండెపోటుతో ఇద్దరు చనిపోవడం చాలా బాధాకరమని అన్నారు. 44 సంవత్సరాల చిన్న వయస్సులో పి మదార్ సాహెబ్ మరణించడం వలన వారి కుటుంబం రోడ్డున పడిందని అన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం మార్కెట్ యార్డ్ పాలకమండలి, అంగడి యజమాని మానవతా ధృకృథంతో ఆదుకోవాలని కోరారు. మార్కెట్ యార్డులో సరైన సౌకర్యాలు లేక మార్కెట్ యార్డు హమాలి కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలన్నిటిని ఆదుకోవాలని లేదంటే కార్మికులను సమీకరించి పోరాట బాట పట్టవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ హమాలి యూనియన్ నాయకులు షేక్షావలి, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, షేక్‌షా, రామ్‌లక్ష్మణ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ హమాలి మదార్ సాహెబ్ భౌతిక కాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న రాధాకృష్ణ, రాముడు

మే డే స్ఫూర్తితో ముందుకెళ్దాం

- సిఐటియు డివిజన్ నాయకులు నారాయణస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి

మే డే స్ఫూర్తితో ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందామని సిఐటియు డివిజన్ నాయకులు కెపి.నారాయణస్వామి కోరారు. మంగళవారం చిప్పగిరిలో నారాయణస్వామి ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవ వేడుకలను రెండో రోజు నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, స్వచ్ఛ భారత్ కార్మికుల సమక్షంలో ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. పెట్టుబడిదారులు కార్మికులను మనుషులుగా చూడకుండా 14 నుంచి 18 గంటల వరకు పని చేయించుకుని లాభాలను దోచుకునే వారన్నారు. 1886 అమెరికా దేశం చికాగో నగరం మార్కెట్ దగ్గర జరిగిన పోరాటాన్ని అణిచివేయడానికి పెట్టుబడిదారి పాలకవర్గం కార్మికులపై నిర్ధాక్షణ్యంగా కాలుపులు జరిపి ప్రాణాలు తీసిందని తెలిపార. ఆ రక్తం నుంచి వచ్చిన జెండానే ఎర్రజెండాగా మారి కార్మికుల విప్లవ కెరటం అయిందన్నారు. ఆ స్ఫూర్తితోనే 8 గంటల పని విధానాన్ని సాధించిందన్నారు. సిఐటియు మండల నాయకులు ఈరన్న, స్వచ్ఛ భారత్ కార్మికులు గోవిందు, గోవిందప్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిప్పగిరిలో జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఉత్సాహంగా ఘంటసాల గాన విభావరి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో లలిత కళా సమితి ఆధ్వర్యంలో ఎపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల బృందం సమక్షంలో మంగళవారం మధుర గాయకులు పద్మశ్రీ ఘంటసాల గాన విభావరి ఉత్సాహ భరితంగా సాగింది. ఆర్‌టిసి బి.లక్ష్మన్న, హరిబాబు, దేవదాసు, నాగరాజు, గాయనీయమనులు గుంతకల్లు వరలక్ష్మి, గద్వాల రఘు, లీల తమ చక్కని కంఠస్వరంతో ఘంటసాల మధుర గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరింపజేశారు. ముఖ్యఅతిథులుగా పారిశ్రామికవేత్త విట్టా రమేష్, ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీ అహ్మద్, లలిత కళా సేవా సంస్థ అధ్యక్షులు, సామాజిక విశ్లేషకులు, న్యాయవాది, జర్నలిస్టు డాక్టర్ జి.నల్లారెడ్డి, బసిరెడ్డి, హనుమాన్ సింగ్, నటరాజు, ప్రతాప్ స్వామి పాల్గొని సంగీత కళాకారులను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఘంటసాల పాటలు మానసిక వికాసాన్ని, విజ్ఞానాన్ని కలిగిస్తాయని కొనియాడారు. కళాకారులకు ప్రభుత్వం, కళాపోషకులు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.

కళాకారులను సన్మానిస్తున్న నాయకులు

యువగళంతో నూతనోత్సాహం

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం మల్లికార్జున చౌదరి, కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదిస్తున్నారని, టిడిపి నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందని, ఇక టిడిపికి తిరుగుండదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం మల్లికార్జున చౌదరి, టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ, కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. మంగళవారం చిప్పగిరిలో టిడిపి నాయకులు బర్మీ భోజరాజు నిర్వహించిన శ్రీపెద్దమ్మ అవ్వ దేవరకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంపై అన్ని వర్గాల వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజార్టీ సాధిస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు గుర్రం దేవేంద్రప్ప, భీమ లింగప్ప, ఉమాపతి నాయుడు, అమరేష్, శివలింగ, గుర్రం అనిల్, జహీర్, కొండ రామాంజిని, గురు గోపాల్, జయరాముడు, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

మల్లికార్జున చౌదరికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ఆదర్శనేత దాచూరి రామిరెడ్డి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆదర్శ ఉపాధ్యాయ ఉద్యమ నేత దాచూరి రామిరెడ్డి అని, ఆయన జీవితాన్ని ప్రతి ఉపాధ్యాయుడూ స్ఫూర్తిగా తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయ ఉద్యమ నేత దాచూరి రామిరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో 1938 జనవరి 15న రామిరెడ్డి జన్మించారని తెలిపారు. నెల్లూరు జిల్లా రాపూరు సమితి మద్దెలమడుగు గ్రామంలో 1958లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారని చెప్పారు. ఆ నాటి నుంచి ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి ఆయన రాష్ట్ర కార్యదర్శిగా, అనంతరం రాష్ట్ర అధ్యక్షులుగా 1981 నుంచి 2000ల మధ్య కాలంలో సేవలందించారని చెప్పారు. ఉపాధ్యాయులకు రీగ్రూపింగ్ స్కేల్‌ను సాధించి పెట్టిన ఘనత ఈయనకే దక్కుతుందన్నారు. నిరాడంబరత, నిజాయితీ, ఆదర్శవంతం కలగలిసిన జీవనశైలి ఆయనదని గుర్తు చేశారు. 1982లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉంటూ తూర్పు రాయలసీమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారని తెలిపారు. 2007లో మళ్లీ ఎమ్మెల్సీగా విజయం సాధించారని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘాలు చేసే పోరాటాలను శాసనమండలి వేదికపై ప్రతిబింబించేవారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో నేటితరం ఉపాధ్యాయులు పని చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్, ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, మల్లికార్జున, సీనియర్ నాయకులు రాఘవేంద్ర, మాదన్న, కె.నాగరాజు, ఎం.రాజు, లక్ష్మన్న, భాగ్యరాజు, ప్రసాద్, జి.బాబు, నాగేశ్వరరావు, పెద్దారెడ్డి, చిన్న ఎల్లప్ప, మాధవస్వామి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆదోని ఎఎస్పీగా బాధ్యతల స్వీకరణ

- గంట వ్యవధిలోనే నియామకం నిలిపేస్తున్నట్లు ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్ కేంద్రానికి ఎఎస్పీగా ఇటీవలే ఆదిరాజ్ రాణాను ప్రభుత్వం నియమించింది. ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం ఆయన ఆదోని ఎఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. సిఐలు శ్రీరామ్, శ్రీనివాస్ నాయక్, మహేశ్వర్ రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రికార్డులో సంతకం చేసిన, అనంతరం పరిచయ కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా శాంతిభద్రతల పరిరక్షణలో తారతమ్యాలు లేకుండా విధులు నిర్వహిస్తామని మీడియాకు వివరించారు.

బాధ్యతలు తీసుకుంటున్న ఆదిరాజ్ రాణా

నియామకం నిలిపేశారు..?

ఆదోని డీఎస్పీ కార్యాలయంలో ఎఎస్పీగా ఆదిరాజ్ రాణా బాధ్యతలు చేపట్టిన గంటల్లోనే నియామకం నిలిపివేసినట్లు ఉత్తర్వులు వచ్చాయని సమాచారం. ఉన్నపలంగా కార్యాలయం నుంచి వెనుతిరిగినట్లు పోలీసులు తెలిపారు. ఐపిఎస్ అధికారి బాధ్యతలు చేపట్టడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట, శాంతి భద్రతల పరిరక్షణ మెరుగుపడుతుందని ప్రజలు భావించారు. ఎఎస్పీ స్థాయి అధికారి డివిజన్ కేంద్రంలో బాధ్యతలు నిర్వర్తిస్తే తమ రాజకీయ ప్రాబల్యానికి ఆటంకంగా ఉంటుందని, తమ మాట చెల్లుబాటు కాదని, ఎమ్మెల్యేలు తమ ఆక్రోశాన్ని వెలగక్కినట్లు తెలిసింది. ఆయన ఇక్కడికి రాకమునుపే ఐపిఎస్ అధికారి బదిలీకి ముందుగానే సన్నాహాలు జరిపినట్లు వినికిడి. ఉన్నపలంగా నియామకం రద్దు ఉత్తర్వుల వెల్లడి పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. తమ కనుసన్నల్లో మెలిగే అధికారిని ఇక్కడికి డీఎస్పీగా వేయించుకునేందుకు ఎమ్మెల్యేలు విజయవాడలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఎక్కడికి ఎవరిని కేటాయిస్తారో ఉన్నతాధికారులు ప్రకటించాల్సి ఉంది. అధికారుల విధి నిర్వహణలో రాజకీయ నాయకుల పెత్తనం ఏ స్థాయిలో ఉందో ఈ ఘటనే నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. ఎఎస్పీ స్థాయి అధికారిని గంటలోనే నియామకం రద్దు వెల్లడి పట్ల జిల్లాలో పలు విమర్శలకు దారి తీసింది. త్వరలోనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉపాధి రక్షణకు కలెక్టరేట్ ముట్టడి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి - కౌతాళం

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం మండల కన్వీనర్ ఈరన్న కోరారు. మంగళవారం మండలంలోని బదినేహాల్ గ్రామం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని ఎన్ఐసిలో మార్చి ఉపాధి కూలీలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు ఈనెల 22న కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఎన్ఐసి సర్వర్ వల్ల సాంకేతికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మస్టర్‌లో రెండుసార్లు ముఖ హాజరును రద్దు చేయాలన్నారు. 15 రోజులకోసారి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

మా డబ్బులు కావని మీరేలా గుర్తిస్తారు..?

- ధరణి పొదుపు లక్ష్మీ గ్రూపు సభ్యులు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమకు జమ చేసిన వైఎస్ఆర్ ఆసరా డబ్బులు ఎందుకు తిరిగి ఇస్తాం. మా డబ్బులు కావని మీరేలా గుర్తిస్తారు. మా ఖాతాకు మా పేరుపై వచ్చిన డబ్బులను ఎందుకు తిరిగి చెల్లించాలి' అని పొదుపు మహిళలు మంగళవారం వాగ్వాదానికి దిగారు. అలాగే 'మీ డబ్బులు కావు' అని తమకు అధికారంగా, రాతపూర్వకంగా వెలుగు సిబ్బంది రాసి ఇవ్వాలని, తాము డబ్బులు చెల్లిస్తామని పొదుపు మహిళలు పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఆసరా డబ్బులో లంచం ఇవ్వలేదని కుట్ర పన్ని తమకు పడిన ఆసరా డబ్బులను రికవరీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ధరణి పొదుపు గ్రూపు మహిళలు వెలుగు సిబ్బందిపై విమర్శలు చేశారు. వైఎస్ఆర్ ఆసరా పథకం కింద కోసిగిలోని ధరణి పొదుపు గ్రూపు సభ్యులకు రెండు విడతలకు సంబంధించి రూ.2 లక్షలు వారి ఖాతాకు ప్రభుత్వం జమ చేసింది. ధరణి గ్రూపునకు జమచేసిన డబ్బులు, మరో ధరణి పొదుపు గ్రూపునకు సంబంధించినవి అంటూ, రూ.2 లక్షలు తిరిగి చెల్లించాలని, ధరణి పొదుపు గ్రూపునకు సంబంధించిన పొదుపు పుస్తకాలను సంబంధిత అధికారులు లాక్కున్నారు. ఏడు నెలల నుంచి చెప్పులరిగేలా వెలుగు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ పొదుపు పుస్తకాలు ఇవ్వడం లేదని పొదుపు మహిళలు వాపోయారు. పొదుపు పుస్తకాలు లేకపోవడంతో గత ఏడు నెలల నుంచి తీసుకున్న అప్పును విడతలవారీగా బ్యాంకు వారు కట్టించుకోవడం లేదన్నారు. తమకు బ్యాంకులో వడ్డీ ఎక్కువ అవుతుందని పొదుపు పుస్తకాలు ఇవ్వాలని వెలుగు సిబ్బందిని బతిమాలాడినా ఆసరా డబ్బులు ఇస్తేనే పొదుపు పుస్తకాలు ఇస్తామని, లేకుంటే లేదని వెలుగు సిబ్బంది తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని మహిళలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమకు జమ చేసిన ఆసరా డబ్బులు ఎందుకు తిరిగి ఇవ్వాలని, తమ డబ్బులు కావని మీరేలా గుర్తించారని ప్రశ్నించారు. తమ ఖాతాకు, తమ పేరుపై వచ్చిన డబ్బులను ఎందుకు తిరిగి చెల్లించాలని నిలదీశారు. ఈ విషయంపై ఎపిఎం సత్యమ్మను ఫోన్ ద్వారా వివరణ కోరగా... ధరణి పొదుపు గ్రూపులు రెండు ఉన్నాయన్నారు. వేరే గ్రూపునకు సంబంధించిన డబ్బులు, పేర్లు ఒకటే కావడంతో ఈ గ్రూపునకు డబ్బులు జమ చేశారని తెలిపారు.

వెలుగు కార్యాలయం ముందు వాగ్వాదానికి ధరణి పొదుపు గ్రూపు సభ్యులు

బండగట్టు నీటి సరఫరాకు అంతరాయం

- నీటి ఎద్దడితో అవస్థలో గ్రామాలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని బండగట్టు రిజర్వాయర్ నుంచి దేవనకొండ, కప్పట్రాళ్ల, కరివేముల, కొత్తపేట, అల్లారుదిన్నె, వెలమకూరు, వరిముక్కల, గద్దెరాళ్ల గ్రామాలకు తాగునీటి సరఫరా పైపు లైన్ల ద్వారా జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు విద్యుత్ తీగలు తెగి పడడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దేవనకొండలోని 2, 4, 5, 6, 7వ వార్డులకు నీటి సరఫరా బంద్ కావడంతో ఆయా కాలనీవాసులు తాగునీటి కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం ఒకే ఒక్క రక్షిత నీటి పథకం ఉండడంతో అక్కడికి వెళ్లి తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్నామని, సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలుగు రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 5, 6 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో వరి, పత్తి, ఎండుమిర్చి, కూరగాయలు, ఇతర పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎన్నికల ముందు రూ.4 వేల కోట్లతో విపత్తు నిర్వహణ నిధి ఏర్పాటు చేసి ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

స్థాయికి మించి ఆరోపణలు మంచిది కాదు

- వైసిపి నాయకులు చంద్రకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

టిడిపి నాయకులు భూపాల్ చౌదరి స్థాయికి మించి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేయడం మంచిది కాదని వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, మధుసూదన శర్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం రూ.15 కోట్ల అప్పులు చేశారని, 6 వేల మందికి పింఛన్లు తొలగించారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని టిడిపి నాయకులు భూపాల్ చౌదరి నోటికొచ్చిన అబద్ధాలు చెప్పారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 1.30 లక్షల పర్మినెంట్ సచివాలయ ఉద్యోగాలు, 2.30 లక్షల వాలంటీర్లను నియమించినట్లు చెప్పారు. వారికి నెలకు రూ.5 వేలు ఇస్తున్న విషయం నిరుద్యోగ భృతి లాగా కనబడలేదా అని ప్రశ్నించారు. అలాగే ల్యాండ్, శాండ్, లిక్కర్ గురించి కూడా రాష్ట్రంలోని ప్రతి టిడిపి నాయకుడూ మాట్లాడుతున్నారని తెలిపారు. రాజధాని కోసమని అమరావతిలో 35 వేల ఎకరాల భూమిని అన్యాయంగా రైతుల నుంచి చంద్రబాబు లాక్కున్నారని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు మహిళా తహశీల్దార్ నీరజాక్షిని జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టారని, లిక్కర్ పాలసీని అమలు చేస్తూ జిఒలు జారీ చేశారని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, దేవా, కౌన్సిలర్ చలపతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకాంత్ రెడ్డి

తాగునీటిని విధిగా తెచ్చుకోవాలి

- ఎపిఒ శ్రీనివాసులు - ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - హొలహర్వి

ఉపాధి కూలీలు విధిగా తాగునీరు తెచ్చుకోవాలని ఎపిఒ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని మేదేహాల్ గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా జరుగుతున్న పనులను ఎపిఒ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో పని చేసే వారి పేర్లను మస్టర్లలో హాజరు వేసేలా మేటీలు చూడాలని ఆయన తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం 6 గంటలకే పనిలోకి వచ్చి, 10.30 గంటలకు పని చేసుకుని వెళ్లాలని సూచించారు. కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఎపిఒ శ్రీనివాసులు

చదువుతోపాటు క్రీడలూ అవసరం

- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

క్రీడ సామగ్రిని అందజేస్తున్న ప్రకాష్ జైన్

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు కూడా అవసరమని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కళాభారత్ సేవా సమితి కార్యాలయంలో ఉచిత కరాటే, యోగా, బాక్సింగ్, వెపన్స్ ఏరోబిక్స్ అంశాలపై ఉచిత శిక్షణ ప్రారంభించారు. ప్రకాష్ జైన్ మాట్లాడుతూ... మహిళల ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. సంప్రదిస్తే తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కేశవ మాస్టర్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ కళాభారత్ సేవా సమితికి రూ.20 వేల విలువ చేసే క్రీడా పరికరాలను వితరణ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. శిక్షణలో పాల్గొనే వారు గట్టు వీరయ్య శెట్టి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిబి వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శంకర్ నగర్ మ్యాక్ సెంటర్‌లో సచివాలయం ఎఎన్ఎంలు, ఆశాలకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిక, ఎంపిహెచ్ఎస్ బాబురాజు ఆధ్వర్యంలో మంగళవారం టిబి వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిబి రోగులను పరీక్షించి వారికి మ్యాక్ సెంటర్ నుంచే మందులు ఇస్తారన్నారు. రెండు వారాలపాటు దగ్గు ఉన్నట్లయితే టిబిగా అనుమానించాలని తెలిపారు. టిబి ఉన్న వ్యక్తికి ఉదయం, సాయంత్రం జ్వరం వస్తూ ఉంటుందన్నారు. బరువు తగ్గడం, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం, రక్తపు ఛారలతో కూడిన గళ్ల పడడం తదితర లక్షణాలున్న వారు ఉదయం తీసిన గళ్లను తీసుకొస్తే నిర్ధారణ కోసం పరీక్షకు పంపుతామని తెలిపారు.

సూచనలు చేస్తున్న డాక్టర్

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్.నెం.939/2020

పెరుగు.విజయవర్ధన్ రెడ్డి.
...వాది

- ఎదురి -

కదిరి.సుధాకర్ రావు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

కదిరి. సుధాకర్ రావు తండ్రి కె.దేవ భక్తుడు ఇంటి.నెం. 87/ 1107/ పి-20, న్యూ గణేష్ నగర్, కర్నూలు సిటీ.

పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తం రూ.3,08,000/-లు ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు.సదరు దావాలో కోర్టు వారు ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న తేదీ 09-05- 2023వ తేదీ పగలు 10:30 గంటలకువాయిదా ఉన్నది. పై తేదీ నాడు మీరు గాని మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతర ములు లేవని మీ పరోక్షమున పై దావాను విచారించి తీర్మానించబడునని తెలియజేయ డమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 09-05-2023

పి.సువర్ణారెడ్డి,
వాదిపరం న్యాయవాది

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్.నెం.1089/2022

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, మెయిన్ బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ చీఫ్ మేనేజర్, కర్నూలు.
...వాది

-ఎదురి-

పి.పుల్లయ్య శెట్టి డైడ్ బై ఎల్.ఆర్.ఎస్.
1.పి.పార్వతమ్మ
2. పి.వెంకటేశ్వర్లు
ఇద్దరి నివాసము, ఇంటి. నెంబర్. 40/808-సి 2, శ్రీనివాస నగర్ కర్నూలు. ...ప్రతివాదులు

ప్రతివాదులకు దావా సమన్లు

పై నంబరు దావాలో వాది, ప్రతివాదుల నుండి దావా మొత్తం రూ.3,99,322/-లు రాబట్టు కొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినారు. సదరు దావాలో కోర్టు వారు ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా రిజిస్టర్ పోస్టు ద్వారాను మీకు సమన్లు పంపినను మీరు సమన్లు తీసుకోనందున ఇందు మూలంగా మీకు తెలియజేయడం మేమనగా మీ హాజరు నిమిత్తము పై తెలిపిన కోర్టులో తేదీ 15-05- 2023వ తేదీ పగలు 10:30 గంటలకువాయిదా ఉన్నది. పై తేదీ నాడు మీరు గాని మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపు కొనవలెను. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పై దావాను విచారించి తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 15-05-2023

బి.అమరనాథ్,
వాదిపరం న్యాయవాది, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.67/2022

శ్రీమతి ఎ.పద్మావతి. ...వాది

-వర్సెస్-

ఎ.బాలప్ప వగైరా. ...ప్రతివాది

3వ ప్రతివాదికి దావా సమన్లు

ఎ.రాజకుమార్ తండ్రి ఎ.బాలప్ప,
ఇంటి నెం.18/44-జె,ఎ.కె.మార్కెట్,
నెహ్రూరోడ్డు, కర్నూలు.

పై నంబరు దావాలో వాది, షెడ్యూలు దాఖలా ఆస్థిలో 1/5వ భాగం పంచి ఇవ్వమని (2) సదరు షెడ్యూలు ఆస్థిని పంచి ఇచ్చిన తరువాత కోర్టువారు కోర్టు కమీషనరు ద్వారా ఒక్కొక్కరికి 1/5 వ భాగం విభజించి ఎవరి భాగము వారికి స్వాధీనం చేయమని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 03-05-2023వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు :-

The Residential property bearing Door No. 18/44/J and 18/44/J/1(Consisting Ground floor and First floor) situated at Nehru road, Kurnool which is within the limits of Municipal Corporation, Kurnool and also within Jurisdiction of The Registration District of Kurnool and Sub-Regn. Office of Kurnool.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 03-05-2023

యం.ఆర్.క్రిష్ణ,
పి.పాపన్న
శ్రీమతి.రాధారాణి,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

IN THE HONOURABLE COURT OF THE Xth ADDITIONAL DISTRICT JUDGE (MACT) AT ANAKAPALLI
M.O.P. 1086 / 2022

Between:
Malla Krishnavani and others ... Petitioners
And:
Rajamadgari Hazmathulla and another ... Respondents
To,
Respondent- 1 :
Rajamadgari Hazmathulla S/o. Ahammad, aged 40 years, Mustim, D.No. 26-73, Kothapeta, Atmakur mandal in Kurnool district (Driver of Crime Vehicle Lorry Bearing No. AP 39 TD 0828)
Respondent- 1 :
M.Shaikshavali, S/o. Mohin Usmam Bhasha, aged not known to the petitioner, Mustim, D.No. 27-79, Kothapeta, Atmakur mandal in Kurnool District-518422 (Owner of Crime Vehicle Lorry Bearing No. AP 39 TD 0828)

Please take notice that the above named petitioners have instituted the above petition against you for compensation with interest and costs. You are hereby summoned to appear before the court in person or through advocate duly instructed and able to answer all material questions relating to the above petition on **10-05-2023 at 10-30 A.M**. in default of your appearance on that day, the mattr will be heard and decided in your absence.

(By order of Honourable Court of the X Additional District Judge at Anakaplli.
KRK APPARAO
Advocates, Anakapalle.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.629/2022 ఇన్ ఓ.యస్.నెం.406/2017

ఓ.రవికుమార్.
...వాది/అర్జీదారు
-Vs-
పిక్కిలి చిన్న పెద్దన్న. ...ప్రతివాది/ రెస్పాండెంటు

రెస్పాండెంటు/ప్రతివాదికి ఆర్డర్

34రూలు 5 సి.పి.సి ప్రకారం నోటీసులు

పిక్కిలి చిన్న పెద్దన్న తండ్రి పిక్కిలి రాముడు,
ఇంటి నం. 86-258-2,మహలక్ష్మినగర్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది ప్రతివాదిపైన కోర్టువారు ఇచ్చిన ప్రిలిమినరీ డిక్రీ (09-05-2022) ని ఫైనల్ డిక్రీ చేయమని అర్జీదాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది/ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 03-5-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాది కాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 03-05-2023

బి.పుల్లయ్య,
కె.శేషసాయిబాబా,
వాది పరం న్యాయవాదులు,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు అట్ ఆదోని

యం. వి. ఓ. పి నెం.48/2020

కె.బందెల నరసప్ప. ...అర్జీదారు

- ఎదురి -

కె.నరసప్ప వగైరా. ...రెస్పాండెంట్లు

ఒకటి, రెండవ రెస్పాండెంట్లకు నోటీసులు

1.కురువ నరసప్ప తండ్రి కె.మునెప్ప,
ఇంటి. నెం.2-87, బి.సి.కాలనీ,
బైలు పత్తికొండ గ్రామం, ఆస్పరి మండలం,
కర్నూలు జిల్లా.
2.యం/యస్. చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రిప్రెజెంటెడ్ బై ఇట్స్ డివిజనల్ మేనేజర్, కర్నూలు.

పై నంబరు యం. వి. ఓ. పి లో అర్జీదారు తనకు రోడ్డు ప్రమాదంలో జరిగిన గాయములకు నష్టపరిహారం రూ.3,00,000/- లక్షలు ప్రమాదం జరిగిన రోజు నుండి 18% ప్రకారము వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పైకోర్టులో అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 1,2 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న తేదీ 18-05- 2023వ తేదీ పగలు 10:30 గంటలకువాయిదా ఉన్నది. పై తేదీ నాడు మీరు గాని మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పై కేసును విచారించి తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 18-05-2023

ఇ. శ్రీనివాసరెడ్డి,
అర్జీదారుపరం న్యాయవాది,
కర్నూలు.

కంప్యూటర్లు తడిసిపోకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పిన అధికారులు

కార్యాలయంలో అడుగు మేర నిలిచిన వర్షపు నీరు

మళ్ళీ ట్రూఅప్ వసూలు

- ఈ నెల నుండి బిల్లులో కలిపి..
- రూ.163 కోట్ల మేర ఉమ్మడి జిల్లాపై భారం



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్తు వినియోగదారులపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత 9 నెలలుగా ట్రూఅప్ (సర్దుబాటు) ఛార్జీలు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే.. దీనికి అదనంగా ఈ నెల నుంచి మరికొంత వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ నెల నుంచి వచ్చే విద్యుత్తు బిల్లులు భారీగా పెరగనున్నాయి.

ఎపిఇఆర్‌సి నుంచి రెండో విడత సర్దుబాటు ఛార్జీలు వసూలు చేసేందుకు ఇప్పటికే అనుమతి వచ్చింది. ఇందులో భాగంగా 2021-22 సంవత్సరానికి సంబంధించి డిస్కంకు వచ్చిన నష్టాలు పూడ్చుకునేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయనున్నారు. 2021-22 ఏప్రిల్‌లో వాడిన యూనిట్లపై ట్రూఅప్ భారాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో కలపనున్నారు. ఏ నెలకు సంబంధించిన బిల్లును ఆ నెల వసూలు చేయనున్నారు. అప్పట్లో అధికంగా విద్యుత్తు వాడకం ఉంటే.. ప్రస్తుతం అందుకు సంబంధించిన భారం సామాన్యులపై పడనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 11 లక్షలకు పైగా విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ, వాణిజ్య, పరిశ్రమలపై భారం వేయనున్నారు. నికరంగా 12.50 లక్షల మందిపై సుమారు రూ.163 కోట్ల మేర భారం పడనుంది. 2019 ఏప్రిల్ తర్వాత తీసుకున్న విద్యుత్తు కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చారు. గతేడాది ఆగస్టు నుంచి తొలి విడత ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. 2014 నుండి వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూఅప్ చార్టీల పేరుతో వసూలు చేస్తున్నారు. కర్నూలు సర్కిల్లోని విద్యుత్తు వినియోగదారుల నుంచి 38 నెలల పాటు వసూలు చేస్తున్నారు. గతంలో వినియోగించుకున్న ప్రతి యూనిట్‌కు 23 పైసలు లెక్క కట్టి బిల్లులో వేస్తున్నారు. ఇలా నాలుగు త్రైమాసికాల్లో నెల వారీగా వసూలు చేసేందుకు చేశారు. ఇప్పటికే బిల్లింగ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అధికారులు సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం వస్తున్న బిల్లులో ఇప్పటికే వసూలు చేస్తున్న సర్దుబాటు ఛార్జీల కారణంగా బిల్లులో 5 నుంచి 10 శాతం వరకు పెరుగుదల కనిపించొచ్చు. కొత్తగా విధిస్తున్న ఛార్జీలు కారణంగా ఈ భారం మరింత పెరిగే అవకాశముంది.

అవుకులో భారీ వర్షం

- తడిసి ముద్దయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- భవనం పై కప్ప కారి అడుగు మేర నీళ్లు
- ఆగిన రిజిస్ట్రేషన్ సేవలు - ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకధాటిగా నాలుగు గంటల పాటు కురిసింది. శిథిలావస్థకు చేరుకున్న సబ్ రిజిస్టర్ కార్యాలయం తడిసి ముద్దయింది. ఆది, సోమవారాలు సెలవు రోజులు కావడంతో మంగళవారం రిజిస్ట్రేషన్‌ల కోసం ప్రజలు ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయితే ఉన్నట్లుండి వర్షం రావడంతో అప్పటికే శిథిలావస్థకు చేరుకున్న సబ్ రిజిస్టర్ కార్యాలయం పై కప్పు నుండి నీరు కారి పూర్తిగా తడిసిపోయింది. కార్యాలయంలో అడుగు మేర వర్షపు నీరు నిలువ చేరింది. కార్యాలయంలో ఉన్న రికార్డులు, కంప్యూటర్లు తడవకుండా అధికారులు ప్లాస్టిక్ పట్టాలను కప్పారు. 1905లో నిర్మించిన ఈ భవనానికి 118 ఏళ్లు పూర్తయ్యాయి. అనేక ప్రభుత్వాలు మారుతున్నా ఈ కార్యాలయాన్ని ఇంతవరకు ఎలాంటి మరమ్మతులు చేయడం లేదు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. వర్షం పడితే చాలు సబ్ రిజిస్టర్ కార్యాలయం మొత్తం చిత్తడి చిత్తడిగా మారుతుంది. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెడుతున్న ఇలాంటి కార్యాలయంపై కన్నెత్తి కూడా చూడకపోవడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండల ప్రజలు పేర్కొంటు న్నారు. రాష్ట్రం మారినా, జిల్లా మారినా అవుకు రిజిస్టర్ కార్యాలయం పరిస్థితి మాత్రం ఏమీ మారడం లేదని సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనాన్ని నూతనంగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం

- జగనన్న గృహ నిర్మాణాలపై కలెక్టర్ అసంతృప్తి
- సంబంధిత తహశీల్దార్లకు షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని కొన్ని మండలాల్లో జగనన్న కాలనీలకు భూసేకరణ చేసి గృహ నిర్మాణాలు చేపట్టకపోవడంపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్‌ల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆగ్రహించారు. ఇళ్ల ప్రారంబానికి నోచుకోక పోవడంపై ఆయా మండలాల తహసీల్దార్‌లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో పూర్తయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్లు, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఇంజనీర్లను ఆదేశించారు. ఆర్‌సి స్థాయిలో వున్న గృహాలన్నీ ఈ నెల 15లోపు పూర్తి చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి స్టేజ్ కన్వర్షన్‌కు తీసుకురావాలన్నారు. నిర్మాణాలకు మెటీరియల్ కొరతలేదని అవసరమైన వాటిని బుక్ చేసుకుని నిర్మాణాలను ముమ్మరం చేయాలన్నారు. పూర్తయిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయడంతో పాటు కలర్ కోడింగ్, ఆర్చీల నిర్మాణాలపై ఫోకస్ పెట్టాలన్నారు. లే అవుట్ల వారీగా తహశీల్దార్లకు, ఎంపీడివోలకు నిర్మాణాల లక్ష్యాలు కేటాయించి ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించాలన్నారు. మిడ్తూరు, గోస్పాడు ఇతర మండలాల్లో గృహ నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలు విశ్లేషిస్తూ సంబంధిత తహశీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. హౌసింగ్ ఈకేవైసీలో దిగువ నుంచి రెండో స్థానంలో ఉన్నామని, లక్ష్య ప్రగతిపై పూర్తిస్థాయి దృష్టి సారించాలన్నారు. డిఆర్డిఏ ద్వారా గృహ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంతో పాటు అర్హులైన వారికి ముద్ర రుణాలు కూడా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పిడి రామశేషు, ఈఈ మాధవరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, హౌసింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- అప్పర్ భద్రపై సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పి
-సాంకేతిక కారణాలతో కృష్ణా రివర్‌బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయలేదు
- డిఆర్‌సిలో జిల్లా ఇంఛార్జి మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్త కుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఇంఛార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆదేశించారు. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం చెబుతూ అప్పర్‌భద్ర ప్రాజెక్టునిర్మాణంపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని, సాంకేతిక కారణాల వల్లనే కర్నూలులో కృష్ణా యాజమాన్య రివర్‌బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేక పోయామని మంత్రి చెప్పారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, తాగునీరు, గహ నిర్మాణాలు, వ్యవసాయం, ఇరిగేషన్ అంశాలపై జిల్లా రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి మాట్లాడుతూ వేసవికాలంలో గ్రామాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలు, ఇతర నీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ వర్షాలు బాగా పడ్డాయని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలవల్ల ఈ మూడు, నాలుగేళ్లలో తాగునీటి సమస్య చాలా తగ్గిందన్నారు. ప్రధానమంత్రి పివి.నరసింహారావు నంద్యాల ఎంపీగా ఉన్న సమయంలో నంద్యాల వాటర్ స్కీంలో భాగంగా ప్యాపిలి, పోదొడ్డి , మామిళ్ళపల్లి గ్రామాలలోని కొంత భాగానికి నీటి సరఫరా కోసం 1995లో పామిడి నుంచి ప్రారంభించిన వాటర్ స్కీమ్ 2004 సంవత్సరానికి అతి కష్టం మీద పూర్తయి 2019 నాటికి ఎండిపోయిందని, ఆ పథకానికి సంబంధించి ఈ ప్రభుత్వం పాత బిల్లులు చెల్లించడంతో పాటు అదనంగా మూడు కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసి ఈరోజు డోన్ నియోజక వర్గంలో 16 గ్రామాలకు నీరు అందిస్తున్నా మన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చలో భాగంగా మంత్రి మాట్లాడుతూ ఎగువభద్ర ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్‌లీవ్ పిటీషన్ (ఎస్‌ఎల్‌పి) ఫైల్ చేసిందని, లిస్టు కూడా అయిందని తెలిపారు. ఈ సమస్యను కోర్టు ద్వారా పరిష్కారం సాధించాలను కుంటున్నట్లు స్పష్టం చేశారు. వర్షపు నీటి ఆధారంగా ఉన్న గాజుల దిన్నె ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్లూయిస్ ఏర్పాటు చేసి హంద్రీ నీవా నుంచి నీటిని తీసుకున్నామని, ఇది 30,40 యేళ్లుగా ఉన్న డిమాండ్ అని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యాన్ని కూడా ఒక టిఎంసి అదనంగా పెంచనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నుంచి డోన్ కు 0.1 టిఎంసి, ఎమ్మిగనూరు కు 0.2 టిఎంసి, అత్యవసర పరిస్థితుల్లో కర్నూలు నగరానికి తాగునీటి అవసరాల కోసం వాడేందుకు ఉపయోగించే నీరు ఒక టిఎంసి కంటే తక్కువ అని మంత్రి తెలిపారు. అయినప్పటికీ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ప్రతిపాదించిన సి.బెలగల్ చెరువు అప్‌గ్రేడ్ చేయడంపై అధ్యయనం చేయాలని ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డిని మంత్రి ఆదేశించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్లే కర్నూలులో కృష్ణా యాజమాన్య రివర్ బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయలేదని మంత్రి సభ్యులకు సమాధానం ఇచ్చారు. హెచ్ఎన్ఎస్-ఎస్ కాలువ నిర్వహణకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని, నిధుల కేటాయింపుకు తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత ఇంజనీర్‌ను మంత్రి ఆదేశించారు. కోవిడ్ సమయంలో వైద్య సేవలందించిన 280 మంది డాక్టర్లకు జీతాల అంశంపై పరిశీలిస్తున్నామని సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఎల్ఎల్‌సికి సంబంధించి జీరో నుంచి 250 కిలోమీటర్ల వరకు తమ ప్రభుత్వం రూ.1400 కోట్ల ఖర్చు చేసి లైనింగ్ పనులు చేయడం వల్లే ఈరోజు కోడుమూరు వరకు నీటితో సస్యశ్యామలంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన సమావేశాన్ని ప్రారంభిస్తూ, కర్నూలు జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో మెరుగైన జిల్లా గా తీర్చి దిద్దే దిశగా ఈ వేదిక ఉపయోగ పడాలని, ఆ మేరకు కార్యాచరణ ప్రణాళిక ను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి, బిటి.నాయుడు, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంఎ. హఫీజ్ ఖాన్, ఎర్రకోటచెన్నకేశవ రెడ్డి, కంగాటి శ్రీదేవి, డాక్టర్‌జె .సుధాకర్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని భారతి విద్యా మందిర్ పాఠశాలలో ఎపి రాష్ట్ర 3వ సీనియర్ పురుషుల, మహిళల జంప్ రోప్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎపి రెడ్డి పాల్గొని పోటీలను ప్రారంభించారు. అలాగే విశిష్ట అతిథులుగా ఎపి రాష్ట్రస్థాయి జంప్ రోప్ సిఇఒ రాజేంద్రప్రసాద్, నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, నాగరాజు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివి రమణారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య, రమణ ఆధ్వర్యంలో 13 జిల్లాలకు సంబంధించిన కార్యదర్శులు, 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పారిశ్రామికవేత్త టిఎంసి వేణుగోపాల్, ఆళ్లగడ్డ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు దేవేంద్ర, ప్రతాప్, మౌలాలి, బాబు, చెన్నయ్య, కర్నూలు జిల్లా జంప్ రోప్ కార్యదర్శి జోసెఫ్, నంద్యాల జిల్లా ప్రైవేట్ నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయు అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, ఆర్‌ఆర్ అకాడమీ కోచ్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా తక్షణసాయం అందజేత

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని గొర్విమానిపల్లి గ్రామానికి చెందిన కోటపాడు లక్ష్మీదేవికి, వెంకట లక్ష్మమ్మ భర్తకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు చొప్పున ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు పులి ప్రకాష్ రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా కింద మిగిలిన అమౌంట్ వారి నామినీల బ్యాంక్ అకౌంట్లో త్వరలో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 10 వేలు అందజేస్తున్న పులి ప్రకాష్ రెడ్డి

జమీయత్ ఉలామా హింద్ సంస్థ సేవలు ప్రశంసనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జమీయత్ ఉలామా హింద్ సంస్థ అధ్యక్షుడు మౌలానా ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కొనియాడారు. మంగళవారం జమీయత్ ఉలామా హింద్ సంస్థ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముఖ్యతిధులుగా హాజరైయ్యారు. పట్టణానికి చెందిన 10 మంది నిరుపేద కుటుంబాలకు పెళ్లికి కావాల్సిన బీరువా, పవిత్ర ఖురాన్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ భాష చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాబున్నిసా, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహబూబ్ బాషా, శాంతినికేతన్ స్కూల్ ఛైర్మన్ సుధాకర్, కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్, మౌలానా మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీ, గన్ని కరీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు బీరువా అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

అలరించిన 'ఈద్ మిలాప్' మషాయిరా

- నిత్యం విద్యార్థినిగా ఉండిపోవాలనిపిస్తుంది
- మున్సిపల్ ఛైర్మన్‌న్ మహబున్నిసా

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని ఉర్దూ భవన్‌లో మంగళవారం కార్వాన్-ఎ-ఉర్దూ ఆధ్వర్యంలో షేక్ అబ్దుల్ సమద్ అధ్యక్షతన నిర్వహించిన 'ఈద్ మిలాప్ ముషాయిరా' (ఉర్దూ కవి సమ్మేళనం) అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉర్దూ అకాడమీ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ఎండి.నౌమాన్, మున్సిపల్ ఛైర్మన్ మహబున్నిసా, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ సలాముల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ తాను విద్యార్థిగా ఉన్నప్పుడు ముషాయిరా విన్నానని, ఈ రోజు ఇక్కడ ఉర్దూ కవుల గీతాలు, ఉర్దూ మాధుర్యం చూస్తుంటే నిత్యం విద్యార్థినిగా ఉండి ఉర్దూ నేర్చుకోవాలనిపిస్తుందని తెలిపారు. సమద్ కార్వానే ఉర్దూ, ఉర్దూ భాష అభివృద్ధికి, ఉర్దూ సాహిత్య మాధుర్యం ప్రజలకు పరిచయం చేయుటకు సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తుందని, ఈ క్రమంలో నేటి ముషాయిరాలో విద్యార్థులు, కవులు విలువైన గీతాలు వినిపిస్తున్నారని తెలిపారు. డాక్టర్ నౌమాన్ మాట్లాడుతూ ఉర్దూ చాలా సరళమైన, మనోహరమైన భాష అన్నారు. దీని ఉనికి కాపాడాల్సిన బాధ్యత ఉర్దూ టీచర్లదే అన్నారు. సలాముల్లా మాట్లాడుతూ ఉర్దూ భాషా ఔన్నత్యం చాటడానికి అన్ని విధాలా కృషి జరగాలన్నారు. అనంతరం మంచి కవితలు వినిపించిన విద్యార్థునులకు ముఖ్య అతిథుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు బహుకరించారు. ప్రముఖ కవులు ఫకీర్ అహమద్, అజీజ్ తద్లీం, అమ్జద్ కౌసర్, ఖతీబ్, కరం జమాన్, యూనూస్ ఖరైషి, అబూ ఇర్షాద్, జమీలుద్దీన్, పర్వేజ్ తదితరులు కవితలు చదివి వినిపించారు. అమ్జద్, అజీజ్ కన్వీనర్లుగా వ్యవహరించారు. అనంతరం అబ్దుల్ అజీజ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో కార్వానే ఉర్దూ కార్యదర్శి అబ్దుల్ అజీజ్, ఫకీర్ అహమద్, పి.వి.ముస్తఫా, వి.సలీం, ఫ్రిజ్ షా సిద్దీఖ్, జమీలుద్దీన్, యూనూస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మునిసిపల్ ఛైర్మన్ మాబున్నిసా

జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాగంటి దేవస్థానం ఛైర్మన్ తోటా బుచ్చిరెడ్డి

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి : ఛైర్మన్

ప్రజాశక్తి - బనగానపల్లె : ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ చోటా బుచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మీరాపురం గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుదారునికి ఒక కేజీ జొన్నలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసిపి నాయకులు మనోహర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి నేత సతీమణికి బిసి ఇందిరా పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె: మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సి.ఫకీర్ సాహెబ్ సతీమణి హుస్సేనమ్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అన్నదాతను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.రాజశేఖర్ - చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలన

చిన్న వంగలి రైతులతో చర్చిస్తున్న నాయకులు ఏ రాజశేఖర్

ప్రజాశక్తి - చాగలమర్రి

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిన్న వంగలి గ్రామంలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన నువ్వులు, కొర్రలు, అరటి తదితర పంటలను వారు పరిశీలించారు. అనంతరం చిన్న వంగలి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎ.రాజశేఖర్ మాట్లాడారు. అకాల వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా పంట నష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా వర్తింపజేయాలని, రాజకీయాల కతీతంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతాంగం వాడే అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగాయని, పండించిన పంటలకు మాత్రం మద్దతు ధరలు ఉండడం లేదన్నారు. ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కావున రైతులందరూ సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కార మవుతాయని, కుల, మత, రాజకీయాలకతీతంగా రైతులందరూ సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సమావేశంలో చిన్న వంగలి గ్రామ రైతులు రామ గురువిరెడ్డి, లక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, చల్లపు రామ గురువిరెడ్డి, వై.చంద్ర ఓబుల్ రెడ్డి, రామ ప్రతాపరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలోని కె.కొత్తూరు, కోటకొండ, ఎల్లా వత్తుల, డి.కొట్టాల, చిన్న కంబలూరు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు రుద్రవరం మండలంలో వరి పంట నేలకొరిగి కోత కోసుకోవడానికి అనుకూలంగా లేకుండా తడిసిపోయిందని, కోత కోసిన పొలాల్లో కుప్పలుగా పెట్టిన ధాన్యం కుప్పల కిందికి నీళ్లు వచ్చి దెబ్బతిందన్నారు. రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యం కుప్పలపై అధిక గాలి వల్ల టార్పాలిన్ పట్టలు లేచిపోయి తడిసిపోయాయని, అలాగే ఉంచిన మొక్కజొన్న వేడి ఎక్కువ కావడంతో రంగు మారి, వాసన వస్తుందన్నారు. వీటిని వ్యాపారస్తులు కొనటానికి ముందుకు రావడం లేదని, గత్యంతరం లేక చాలామంది రైతులు తక్కువ ధరకు అమ్ముకొని పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మరి కొంతమంది రైతులు తడిసిన ధాన్యాన్ని తమిళనాడు రాష్ట్రంలోని మార్కెట్లకు తీసుకుపోయి చార్జీలకు సరిపడా డబ్బులు రాక తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి, మామిడి తోటలు తీవ్ర గాలి, వర్షం కారణంగా చెట్లు పూర్తిగా పడిపోయి, పూత, పింద, కాయలు రాలి నష్టపోయారని అన్నారు. వరుసగా వస్తున్న నష్టాల వల్ల చేసిన అప్పులు చెల్లించలేమని తీవ్ర ఆవేదనలో రైతులు ఉన్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని అన్ని మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా వర్తింపచేయాలని కోరారు. తడిసి రంగు మారిన ధాన్యాన్ని, మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.

రుద్రవరం మండలంలో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు టి.రామచంద్రుడు

మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

అకాల వర్షానికి నష్టపోయిన

రైతులకు పరిహారం ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - పాములపాడు

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం పాములపాడులో రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో అకాల వర్షం పడటం వలన నంద్యాల ప్రాంతంలోని అరటి, మామిడి, పసుపు, వరి వంటి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం రైతులకు మోటార్లకు మీటర్లు బిగించే విధానం వెనక్కి తీసుకోని, నల్ల చట్టాలను పూర్తి రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాములపాడు స్థానిక సమస్యలు పరిష్కరించాలన్నారు. పాములపాడు మెట్ట ప్రాంతానికి ఎర్రిపోతుల పథకం ద్వారా సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు బి.రామేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, బాలయేసు, రవణమ్మ, రంగస్వామి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో కుంభాభిషేకం, శిఖర కలశ ప్రతిష్ట : ఇఒ

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో జూన్ నెలలో కుంభాభిషేకం, శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి వైదిక ఏర్పాట్లు, ఇంజినీరింగ్, పరిపాలన పరమైన ఏర్పాట్లపై మంగళవారం ఇఒ చంద్రశేఖర్ రెడ్డి, ఛైర్మెన్ కొమ్మా మహేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు, పరిపాలనా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్, ఇఒ మాట్లాడుతూ క్షేత్రంలో 20 సంవత్సరాల తర్వాత జరగబోవు కుంభాభిషేకం, కలశ పూజ కార్యక్రమాల కార్యాచరణ త్వరగా ప్రారంభించి సమన్వయంతో దిగ్విజయం చేద్దామన్నారు. ఆలయ పేద పండితులు రవిశంకర్ అవధాని మాట్లాడుతూ కుంభాభిషేకం, కలశపూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు జూన్ మొదటి వారంలో వచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలపై తెలుగు రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహించి భక్తులు విశేషంగా పాల్గొనేలా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. మంగళవారం నియోజవర్గంలోని దొర్నిపాడు మండల కేంద్రం ఎస్సీ కాలనీలో 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎస్సీ కాలనీ పర్యటనలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన తాగునీరు, ఇంటి స్థలాలు, డ్రెయినేజీ, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన పెన్షన్లు తదితర వాటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు ఆలసత్వం వహిస్తే ఆళ్లగడ్డలోని తన కార్యాలయానికి రావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ భూమా చెంచి రెడ్డి, ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, జెడ్పిటిసి పగిడెల శకుంతమ్మ, బత్తుల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి లక్ష్మిరెడ్డి, సర్పంచ్ శానికాదేవి, అమ్మిరెడ్డి నగరం సర్పంచ్ లక్కు చంద్రశేఖర్ రెడ్డి, కాకనూరు మనోహర్ రెడ్డి, బత్తుల కృష్ణయ్య యాదవ్ ,మాధవ స్వామి, ఆలయ ఛైర్మన్ పగడాల శ్రీనివాసులు, పగిడెల శివనాగిరెడ్డి (డీలర్), గోపాల్ యాదవ్, చాకరాజవేముల వైసిపి నాయకులు మనోహర్ నాయుడు, దొర్నిపాడు మాజీ సర్పంచ్ పాదం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి ఏది?

- సమస్యల ఏం సమాధానం చెప్పాలి..
- అధికార పక్ష కౌన్సిలర్లే అసంతృప్తి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో అభివృద్ధి ఏది?, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలు ఏమి చెప్పాలని అధికార వైసిపి కౌన్సిలర్లే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి పురపాలక సంఘం సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ సమస్యలపై గళం వినిపిస్తున్నారు. ఈనెల 1వ తేదీన సోమవారం జరిగిన సాధారణ సమావేశంలోనూ అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నలతో సమావేశం రసాభాసాగా సాగింది. ఆఖరికి సమావేశ హాల్లు బహిష్కరించి అర్ధాంతరంగా వెళ్లిపోవడం పట్ల పలు విమర్శలకు దారి తీసింది.

స్థానిక మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు తమ వార్డులలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని సమస్యలు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. సమావేశానికి ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రభుత్వం ఏమి చేయడం లేదు అంటూ ఆందోళన చేయడం సాధారణం. కానీ అధికార పార్టీ కౌన్సిలర్లే అసహనం వ్యక్తం చేయడంతో స్థానిక సమస్యలు పరిష్కారం కావడంలేదని ప్రతిపక్ష నాయకులు, పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు

సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

వైసిపి చెందిన వారే, ఒకరు మాత్రమే టిడిపి చెందిన కౌన్సిలర్ కొనసాగుతున్నారు. మున్సిపాలిటీ పరిపాలనలో వైసిపి కౌన్సిలర్లదే కీలకపాత్ర మెజార్టీ వారిదే ఉన్నప్పటికి అధికార పార్టీలోనే విభేదాలు తయారవుతోందని విశ్లేషకులు అంటున్నారు. అధికారులకు, కౌన్సిలర్ల మధ్య సత్సంబంధాలు దెబ్బతిన్నాయని కొందరు అభిప్రాయ పడుతున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి బడ్జెట్ నిధుల కేటాయింపులో వ్యత్యాసాలు చూపిస్తున్నారని ఆరోపణలు పట్టణ ప్రజల్లో చర్చించుకుంటున్నారు. అందుకు 7వ వార్డు కౌన్సిలర్ షేక్ నాయబ్ వాదనలే నిదర్శనం అనుకుంటున్నారు. తాను కౌన్సిలర్‌గా ఎన్నికైన నాటినుండి ఇంతవరకు తమ వార్డులో ప్రభుత్వం ద్వారా విడుదలైన బడ్జెట్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంపై బహిరంగంగా తన వానిని వినిపించడంపై అంతర్గత విమర్శలు, పైన ఆరోపణ వినిపిస్తుంది. 17వ కౌన్సిలర్ షేక్ అబ్దుల్ రవూఫ్, చిన్నపాటి పనులు కూడా చేపించుకోవడం లేదంటూ కౌన్సిలర్లను స్థానికులు నిలదీస్తున్నట్లు సమాచారం. మరొక కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ మున్సిపాలిటీ ఆదాయమే, ఖర్చులు పూర్తి వివరాలు, కావాలని కోరడంపై మున్సిపాలిటీలో బిల్లుల అవకతవకలు, పరిశుభ్రత కార్మికుల నియామ కాలు వారికి బిల్లుల చెల్లింపు విషయంలో అవకతవకలు జరుగుతు న్నాయని ఆరోపణలకు ఈయన వాదనే అని చర్చించుకుంటున్నారు. ఇకనైనా మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పట్టణ ప్రజలు, మేధావులు కోరుకుంటున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో కౌన్సిలర్లు విన్నవించే ప్రజల సమస్యలను ప్రతి అధికారి పరిష్కరించాలి. నిర్లక్ష్యం తగదు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తా.

- నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్, పి కిషోర్

ఉపాధ్యాయ ఉద్యమానికి దాచూరి అంకితం : యుటిఎఫ్

ప్రజాశక్తి - డోన్

ఉపాధ్యాయ ఉద్యమానికి దాచూరి రామిరెడ్డి అంకితం అని రాష్ట్ర పూర్వ గౌరవాధ్యక్షులు నర్సింహులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు ఎన్.ఎస్.బాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, మండల గౌరవాధ్యక్షులు లక్ష్మయ్య, ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డిలు అన్నారు. మంగళవారం డోన్ పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట నందు దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచూరి ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉంటూనే 1970లో ప్రకాశం జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పరీక్షా విధానంలో నూతన ఒరవడి తెచ్చారన్నారు. యుటిఎఫ్

డోన్: దాచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆవిర్భావం నుంచీ ఆయన రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తుండేవారని,రాష్ట్ర అధ్యక్షునిగా 20సంవత్సరాలు పనిచేశారని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘాలు చేసే పోరాటాలను శాసన మండలి వేదికపై ప్రతిబింబించేవారని, శాసనమండలి సభ్యునిగా తీసుకున్న అలవెన్సులు సంఘానికి జమచేసి, సంఘం ఇచ్చిన నామమాత్రపు అలవెన్సుతో సాధారణ జీవితం గడిపిన ఆదర్శమూర్తి అని కొనియాడారు. పాలకులు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కదాన్ని తుంగలో తొక్కుతున్నారని, దాచూరిని స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడిగా పోరాడవలసిన సమయ ము ఆసన్నమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.వై.సుబ్బారాయుడు, రాజశేఖర్,అబ్దుల్ లతీఫ్,సర్వజ్ఞ మూర్తి,క్రిష్ణ నాయక్,రఘునాయక్, చంద్రమోహన్, రాజా కుల్లాయప్ప,సుమన్ తదితరులు పాల్గొన్నారు. **సంజామల :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపకునిగా దాచురి రామిరెడ్డి ఎనలేని కృషి చేశారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం దాచురి రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారని తెలిపారు.

చెంచు గూడెంలలో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి

- గుర్తించిన పనులకు రూ.40 లక్షలు మంజూరు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని 42 చెంచు గూడెంలకు నియమించిన దత్తత అధికారులు తనిఖీలు నిర్వహించి గుర్తించిన ప్రాథమిక సౌకర్యాల కల్పనకు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో చెంచు గూడెంలలో కనీస వసతి సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులు, దత్తత అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల్లోని 42 చెంచు గూడెంలలో దత్తత అధికారులు గుర్తించిన తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు తదితర ప్రాథమిక మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. చిన్న కొట్టాల చెరువు, బైర్లూటీ, నారపురెడ్డి కుంట, మాడుగుల, గాజులపల్లి మెట్ట తదితర 9 చెంచు గూడెంలలో తాగునీటికి సంబంధించి బోర్ల మరమ్మతులు, డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులు, ఆర్వో ప్లాంట్, సోలార్ కనెక్షన్, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు తదితర పనులకు ఎంపి ల్యాడ్స్ కింద రూ.40 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిపిఒ వేణుగోపాల్‌కు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కింద చెంచుగూడెంలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్‌ను ఆదేశించారు. వెలుగోడు చెంచు కాలనీలో ఐటిడిఎ కార్పొరేషన్ నుండి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ అధికారికి సూచించారు. చెంచు గూడెంలలో మంజూరైన 2170 గృహాలలో నిర్మాణాలకు అనువుగా ఉన్న 651 ఇళ్లను వారం రోజుల్లో గ్రౌండింగ్ చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. 16 గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రూ.9.8 లక్షలతో ఆరు బెడ్ల షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎదురుపాడు, 80 బన్నూరు గ్రామాలలో 24 వ్యవసాయ బోర్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని డ్వామా పిడిని ఆదేశించారు. జానాల గూడెం, మాడుగుల, ఎర్రమఠం గూడెంలలో సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు తనిఖీ చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని నెడ్ క్యాప్ అధికారికి సూచించారు. చెంచు గూడెంలలో గుర్తించిన 88 రేషన్ కార్డులకు గాను కేవలం 4 కార్డులు మాత్రమే పూర్తి కావడంపై సివిల్ సప్లయిస్ అధికారిపై అసహనం వ్యక్తం చేస్తూ వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల జారీకి నిర్లక్ష్యం వహించిన అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఐటిడిఎ పిఒను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు, పెన్షన్ల జారీకి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గూడెంలలో రక్తహీనత స్త్రీలు, పోషక లోపాలున్న వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ఎపిడి మురళి, అధికారులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి -ప్యాపిలి

కరెంట్ బిల్లులు కట్టకుంటే కనెక్షన్ కట్ చేసే అధికారులకు ప్రమాదపరితంగా ఉన్న కరెంటు స్తంభాలు కనీస బాధ్యత ఉండదని నిరూపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. విద్యుత్ మెయిన్ లైన్ ఇది. ఊరు లోకి సప్లై కరెంటు లైన్ బాలికల ఉన్నత పాఠశాల వెనుక బాగాన వున్నది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల విద్యుత్ స్తంభం ఒరిగిపోయిందని, విద్యుత్ స్తంభం పడిపోతే పెద్ద ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొని ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి : బిఎస్‌పి

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఈనెల 7వ తేదీన హైదరాబాదు సరూర్ నగర్ స్టేడియంలో జరుగు బిఎస్‌పి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు నందికొట్కూరు అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు కోరారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో కాన్షిరాం సర్కిల్ నందు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడారు. బహుజన రాజ్యాధికారం కోసం పోరాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు రవి, శేషన్న, లడ్డు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో అభివృద్ధి

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామ, వార్డు సభ్యులందరితో సమిష్టిగా అభివృద్ధికి కృషి చేద్దాం అని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ నెట్ల మహేశ్వరి అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉప్పలపాటి స్వర్ణకుమార్, సచివాలయ కార్యదర్శి నాగమణి ల అధ్యక్షతన గ్రామ సర్వసభ్య సమావేశం (గ్రామసభ) నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నెట్ల మహేశ్వరి పలు గ్రామ పనులను సమావేశముందు చదివి వినిపించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ఏరాసు సుబ్బలక్ష్మమ్మ వార్డు సభ్యులు స్వర్ణకుమారి, బొల్లవరపు మహేశ్వరి, మూరబోయిన శేషమ్మ తదితరులు పాల్గొన్నారు. ఉపసర్పంచ్ సుబ్బ లచ్చుమ్మ, స్వర్ణ కుమారి మరో వార్డు సభ్యులు సమావేశం మధ్యలోనే వెళ్ళిపోవడం కొసమేరుపు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్మశాన వాటిక శుభ్రతపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు

మండల కేంద్రంలోని హిందూ స్మశాన వాటిక శుభ్రతపై చర్యలు తీసుకోవాలని పాములపాడు నాయకులు, ప్రజలు ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ అలాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న స్మశాన వాటిక నందు గ్రామానికి చెందిన వివిధ హోటల్స్, కటింగ్ షాపుల పదార్థాలు, చికెన్ షాపులకు చెందిన వ్యర్థ పదార్థాలు అన్నిటిని అక్కడ వేయడం ద్వారా ఆ శుభ్రంగా ఏర్పడి స్మశాన వాటిక నందు హిందువులకు పలు ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని హోటల్స్ షాప్‌లో అందరికీ తెలియపరచి వ్యర్థ పదార్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ వెంకటరమణకు పాములపాడు ఎస్ఐ అశోక్‌లకు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ విషయాలపై ఆయా శాఖల అధికారులు సైతం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చౌడయ్య, టిఎన్ఆర్ నాగరాజు, ఆర్ ఎస్ ఆర్ గోపాల్, వెంకటేశ్వరరావు,కోట్ల నాగేశ్వర్ రెడ్డి ఏ చంద్ర, సాయి, సురేష్ ,వెంకటేశ్వర్లు ,పిచ్చిరెడ్డి ,సత్యమయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

4న సోమయాజుల పల్లెలో గడపగడపకు..

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఈనెల 4వ తేదీన మండలంలోని సోమయాజుల పల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో వాసుదేవ గుప్త మంగళవారం తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పగిడ్యాల

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టిన్నట్లు ఈఓఆర్‌డి పుల్లయ్య, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న తెలిపారు. మంగళవారం పగిడ్యాల గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పగిడ్యాల అంబేద్కర్ విగ్రహం సమీపాన ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టిన్నట్లు వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జొన్నలు పంపిణీతో హర్షం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ ద్వారా జొన్నలు, రాగులు పంపిణీ చేయడం పట్ల రేషన్ కార్డు యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బండి ఆత్మకూరు గ్రామంలో ప్రజలకు ఇంటి వద్దకే జొన్నలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జొన్నలు, రాగులను రేషన్‌లో తీసుకున్న కార్డుదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల నుండి రాగులు, జొన్నలు ఉచితంగా పంపిణీ ప్రారంభించడం జరిగిందని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుప్రియ, వైకాపా మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపీటీసీ పుల్లయ్య, వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సారాబట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సారా బట్టీలపై సెబ్ దాడులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండల పరిధిలోని సిద్దేపల్లె గ్రామ శివారులలో ఉన్న నల్లమల్ల అడవిలో అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్న కేంద్రాలపై మంగళ వారం ఆత్మకూరు సిఐ సుబ్రహ్మణ్యం, సెబ్ సిఐ నాయుడు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 లీటర్ల బెల్లపు ఊటను, పది లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. త్వరలోనే నాటుసారా బట్టీల నిర్వాహకులను గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామని అధికారు లు తెలిపారు.

సిఎం కప్ పోటీలకు ఎఎన్ఎం ఎంపిక

- పలువురు అభినందనలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల నాలుగవ సచివాలయంలో ఏఎన్ఎం గా విధులు నిర్వహిస్తున్న రేణుక రాష్ట్రస్థాయిలో జరిగే సిఎం కప్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక కావడం హర్షణీయం అని నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ బేతంచెర్ల నగర పంచాయతీలో సచివాలయంలో విధులు నిర్వహిస్తూ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనభరచడం ఆదర్శనీయం అన్నారు. సచివాలయ సిబ్బంది, పలువురు ఎఎన్ఎంను అభినందించారు.

'ఉపాధి'లో అవినీతిని అరికట్టాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల పర్యవేక్షణ లోపంతో అవినీతి చోటు చేసుకుంటోందని, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల ఉపాధ్యక్షులు పి ఏసన్న, సహాయ కార్యదర్శి బి అశోక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సరస్వతి స్కూల్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్తపల్లి మండలానికి రెగ్యులర్ ఏపీవోను ఏర్పాటు చేయాలి అన్నారు. కొన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది జాబ్ కార్డు ఇవ్వాలని లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపిం చారు. ఎంపీడీవో దృష్టికి ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మండలంలో అవినీతిపై విచారణ జరిపి క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పి పకీరయ్య, కే రాజు, కే రమణయ్య, పి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

తమను నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని టిడిపి యువ నాయకుడు భార్గవరామ్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. స్థానిక కార్యాలయంలో టిడిపి యువ నాయకుడు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వైసిపి నాలుగో వార్డు సభ్యులు కొండయ్యతో పాటు శ్రీనివాసులు, నరేష్, పవన్, రమేష్, సుబ్బయ్య, అర్జి గారి అన్నయ్యతో పాటు మరి కొంతమంది టిడిపిలో చేరారు.

IN THE COURT OF PRINCIPAL
JUNIOR CIVIL JUDGE : DHONE
O.S. No. 470/2022

Chakali Chinna Maddaiah ..... Plaintiff

Vs

Vadde Srihari,
S/o. Vadde Venkata Ramudu
R/o. Obulapuram (Village),
Devarabanda (Post),
Dhone (Mandalam)
Nandyal (District) ..... Defendant

ప్రతివాదికి సమను

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాది అయిన మీ పై దావా ప్రొంసరి బాకీ రాబట్టుకొనుటకు గాను దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా వాయిదా 15-06-2023న వున్నది. పై తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు గాని మీ తరపున వకీలు గారు గాని పై కోర్టు నందు హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను, లేని యెడల పై తెలిపిన కోర్టు వారు సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 15-06-2023

G. SADANANDA BABU,
Advocate
Dhone - 518222.
Nandyal District.
Cell : 9908372413

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 297/2022

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చాగలమర్రి
R/its బ్రాంచ్ మేనేజర్ ....
వాది

V/S

1) యం.కోటయ్య
2) యం. లక్ష్మీదేవి
3) వి. మాబుషరీఫ్ ... ప్రతివాదులు

1,2 వ ప్రతివాదుల అడ్రసు

1 వ ప్రతివాది : మెక్కలూరి కోటయ్య,
S/o. గుర్రప్ప, హెడ్మాస్టర్, బాలుర ఉన్నతపాఠశాల,
చాగలమరి గ్రామం & మండలం

2 వ ప్రతివాది : మెక్కలూరి లక్ష్మీదేవి,
W/o. యం. కోటయ్య, పాత బస్టాండ్,
చాగలమర్రి గ్రామం & మండలం.

పై నెంబరు దావాలో వాది బాకీ రాగోరి 1,2,3 ప్రతివాదులపై దావా దాఖలు చెయ్యగా కోర్టు వారు 1,2 వ ప్రతివాదులకు సమన్లు ఎన్నిసార్లు పంపినను మీ నుండి ఎటువంటి జవాబు లేనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీ హాజరుకై 10-05-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు గాని, మీ తరపున న్యాయవాది గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోగలరు. లేని యెడల మీ పరోక్షములో పై దావాను తీర్మానము జరుగునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 10-05-2023

పి. యస్.మహబూబ్ బాషా
వాది తరపున అడ్వకేట్
చాగలమర్రి – పోస్ట్
నంద్యాల – జిల్లా

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళ వారం వ్యకాసం నాయకులు వేణుగోపాల అధ్యక్షతన నందికొట్కూరు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్ కాలనీలో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంక టేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులు అసంఘటిత కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని వారు ఆరోపిం చారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. వ్యవసాయంలో వ్యవసాయ కార్మికులను పరిశ్రమల్లో కార్మికులను తక్కువ వేతనాలు ఇచ్చి శ్రమదోపిడి చేసుకొని లాభాలు పొందుతున్నారని వారు ఆరోపించారు. అసంఘటిత కార్మికుల ఓట్లతో అధికారంలోకి వస్తున్న పాలకులు వారికి సమగ్ర చట్టం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర చట్టం చేయడం వల్ల 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5000 పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించడంతోపాటు విద్యా, వైద్యం,గృహవసతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోపాలకృష్ణ, ఆర్ జయరాన్ని, లక్ష్మీదేవి, నారాయణ, పకీరయ్య, గౌసియా, కాసిం, సుబ్బమ్మ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకై ప్రతి ఒక్కరు పోరాడాలని సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, గోపాలకృష్ణ పేర్కొన్నారు. మే డే వేడుకల్లో భాగంగా రెండవ రోజు మోటార్ వర్కర్స్ యూనియన్ మార్కెట్ యార్డు సివిల్ సప్లై జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, గోపాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యద ర్శులు బాష, రామలింగప్ప, దౌలత్ బాషా, మార్కెట్ యార్డ్ హమా లి వర్కర్స్ నాయకులు కృష్ణ, సీతారాముడు, వెంకటేశ్వర్లు, వికాస జిల్లా సహాయ కార్యదర్శి టి పక్క సాహెబ్, వికాస జిల్లా నాయకులు, సివిల్‌సప్లై హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు మండల సెంటర్లో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో, వి రామకృష్ణ అధ్యక్షతన, రైతు సంఘం సీనియర్ నాయకులు వి నాగరాజు జెండా ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని అన్నారు. పట్టాలిచ్చిన వారికి భూములు చూపాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఓబులేష్, రైతు సంఘం జిల్లా నాయకులు కే మద్దిలేటి, మిడుతూరు మండల అధ్యక్ష, కార్యదర్శు లు బి హరి నాయుడు, శేఖర్, శుజ్ఞానం, వి రమణయ్య, శ్రీనివాసులు, కె.శివ రాముడు, సుబ్బన్న శివరాముడు, తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక పాలనను అంతం చేయాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసు రత్నం అన్నారు. మంగళ వారము సుండి పెంటలో కార్మిక దినోత్సవ వేడుకల సందర్భంగా సిఐటియు కార్యాలయం నందు జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. ముందుగా సిఐటియు కార్యాలయం నుండి ఊరేగింపుగా బయలుదేరి బస్ స్టాండ్, అంబేద్కర్ సెంటర్ గుండా పురవీధులలో తిరుగుతూ వర్షం సహితం లెక్కచేయకుండా ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ శ్రీశైలం మండలం కార్యదర్శి చిన్నమారన్న అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరము సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, సీపీఎం మండల నాయకులు నాగ సైదయ్య,మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వము కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు ద్రోహం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, నాగ వెంకటేశ్వర్లు,పోలయ్య,నాగేశ్వరరావు, బాల గురునాథం, బాలరాజు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** వీరోచిత పోరాటాల సందర్భంగా కార్మిక హక్కుల సాధించుకున్న రోజే మేడే అని వ్యకాసం మండల కార్యదర్శి డేవిడ్, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్ అన్నారు. మంగళవారం నాడు ఏ కోడూరు, బి కోడూరు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.



జెండాలను ఎగురవేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. నాగేశ్వరరావు, నాయకులు